క్లుప్తంగా

భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ప్రవచనం చెప్తున్న బాల బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ

సామర్లకోట: నైమిషారణ్య పీఠాధిపతి, హిందూ ధార్మిక సంస్థ వ్యవస్థాపకుడు బాలబ్రహ్మానంద సరస్వతీ స్వామీజీ స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. పూజల అనంతరం నంది మండపం వద్ద శివసహిత శక్తి ప్రవచనాలు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, అప్పల బ్రహ్మానందం, హిందూ ధర్మరక్ష సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



సామర్లకోట: స్థానిక కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్యోతిర్లింగార్చన ఎంతగానో ఆకట్టుకుంది. నాగుల చవితిని పురస్కరించుకొని ఉదయం ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం వెలిగించిన తరువాత లక్షపత్రి పూజలు చేసుకున్న వారికి ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. ఇందులో దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీ పడ్డారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

పెద్దాపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని, అభివృద్ధి పనులు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ కృత్తికా శుక్లా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం పెద్దాపురం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆయా శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేశారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్, మండల విస్తరణాధికారి రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అప్పలరాజు, ఎంఈఓలు చౌదరి, ప్రభాకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట సీఐగా సురేష్



సామర్లకోట: స్థానిక పోలీస్ స్టేషన్ సీఐగా సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ సీఐగా పనిచేసిన కె.దుర్గాప్రసాద్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏలూరు నుంచి సురేష్ సామర్లకోటకు వచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వెంకట్రావు (ఫైల్)

సామర్లకోట: హుస్సేన్‌పురం గ్రామంలో ఓ ఇంటి గోడకు నిచ్చెనపై ఉండి పేపరు కొడుతూ కొప్పవరానికి చెందిన పెయింటర్ దోనం వెంకట్రావు ఈ నెల 9న గాయపడ్డారు. స్థానికులు అతన్ని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అతను మృతి చెందాడు. కాకినాడ ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు హక్కుపై అవగాహన తప్పనిసరి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

కొత్తపల్లి: ప్రతి విద్యార్థికి ఓటు హక్కుపై అవగాహన తప్పని సరిగా ఉండాలని తహసీల్దారు ప్రసాద్ అన్నారు. స్థానిక వీవీఎస్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ తప్పనిసరిగా ఓటును నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- చేబ్రోలులో రూ.3 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు



ఇంటింటికీ కుళాయి కనెక్షన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలంలో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేసి సుమారు రూ.3 కోట్లకు పైగా నిధులతో నిర్మించిన, నిర్మించనున్న పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రూ.79.5 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న వాటర్ టాంక్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రూ.43.64 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. రూ.61.70 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన వాటర్ టాంక్‌ను, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లను ప్రారంభించారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ప్రజలు పూలతో స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, సర్పంచ్ లోవతల్లి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



పెద్దాపురంలో బాల్య వివాహాల నిరోధక చట్టం వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

పెద్దాపురం: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యతని దేవదాయ శాఖ జిల్లా అధికారి పులి నారాయణమూర్తి అన్నారు. స్థానిక మహారాణి సత్రంలో బాల్య వివాహాలు చట్ట విరుద్ధం అంశంపై వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణమూర్తి మాట్లాడారు. చట్టంపై అవగాహన కల్పించి ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే జైలుశిక్ష తప్పదన్నారు. దీనిపై 1098, 100 వంటి టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఆయా దేవదాయ శాఖ ఈఓలు కాట్నం జగన్మోహన శ్రీనివాస్, టీవీ సూర్యనారాయణ, సీహెచ్ శ్రీనివాస్, శర్మ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే చదలాడ హైస్కూల్‌లో భేటీ బచావో.. భేటీ పడావో పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయుడు వెంకట్రావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని యువతి, 21 ఏళ్లు నిండని యువకులకు ఎక్కడైనా వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యకుమారి, మహిళా పోలీస్ చిట్టితల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు జాస్మిన్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార అభివృద్ధికి రుణాలు



పవర సొసైటీ వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీసీబీ జీఎం, తదితరులు

సామర్లకోట: అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో సహకార సంస్థల ద్వారా రుణాలు అందించి వ్యాపార అభివృద్ధికి కృషి చేస్తామని డీసీసీబీ జీఎం ప్రవీణ్‌కుమార్ అన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా పవర గ్రామంలో సహకార సంఘ కార్యాలయం వద్ద శుక్రవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు. సంఘం నుంచి పొందిన రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘాల అభివృద్ధికి అంతా సహకరించాలన్నారు. డిప్యూటీ రిజిస్ట్రార్ కృష్ణకాంత్, సొసైటీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పిఠాపురం బ్రాంచ్ నోడల్ ఆఫీసర్ తిరుమల, పిఠాపురం పీఏసీఎస్ మేనేజర్ మహేష్‌కుమార్, సూపర్‌వైజర్ కె నారాయణరావు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్యామలకుమారి, పీఏసీఎస్ సీఈఓ వీరంరెడ్డి కామేశ్వరరావు పాల్గొన్నారు.

కరుణించు నాగన్నా..



సామర్లకోట ఫిల్టర్ బెడ్ ప్లాంట్‌లో పుట్ట వద్ద భక్తుల పూజలు



పెద్దాపురంలో బాలుడితో పుట్టలో పాలు పోయిస్తున్న తల్లి

పిఠాపురం: పచ్చని పొలాల్లో పట్టుపరికిణీలతో కేరింతలు కొడుతూ తిరిగే యువతులు, టపాకాయలు పేలుస్తూ, ఊయలలూగుతూ ఆటపాటలతో ఉల్లాసంగా తిరుగుతూ యువకులు నాగుల చవితి పండుగను ఘనంగా చేసుకున్నారు. అహోరాత్రులు పొలాల్లో, పుట్టల వద్ద పచ్చికలో సంచరించే తమను రక్షించాలని నాగేంద్రుడిని వేడుకున్నారు. శుక్రవారం నాగులచవితి సందర్భంగా పుట్టల్లో పాలు పోసేందుకు భక్తులు పోటెత్తారు. పొలాలో ఉన్న పాముల పుట్టల వద్దకు వెళ్లి ముగ్గులు పెట్టి ఆవుపాలు, కోడిగుడ్లు, బుర్రగుంజు, చిమ్మిలి, చలిమిడి, వరి నూక పుట్టలో పోసి నాగేంద్రుడికి పూజలు చేశారు. కోరిన కోరికలు తీర్చే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తమ కుటుంబాలను చల్లగా చూడాలని వేడుకున్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, ఏకే మల్లవరం, దుర్గాడ తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద నాగుల చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దుర్గాడలో రామలింగేశ్వరునికి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, నాగబంధాలకు ప్రత్యేక పూజలు చేశారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో నాగుల చవితి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మండల పరిధి పొలాల్లోని పుట్టల వద్ద నాగుల చవితి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పుట్టల్లో పాలు, గుడ్లు, చలిమిడి, చిమ్మిలి వేసి నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు.



తాటిపర్తిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అనంతరం బాణసంచా కాల్చారు. మధ్యాహ్నం కుటుంబాలతో సహా పొలాల్లో వన భోజనాలు చేసి సాయంత్రం వరకు ఆటపాటలలో గడిపారు.

రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, బాలా త్రిపురసుందరి రాజశేఖరస్వామి, ధర్మశాస్తా, ఉప్పాడలో చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, గోర్సలో పురాతన రామాలయం, ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

పెద్దాపురం/ సామర్లకోట: పెద్దాపురం, సామర్లకోట అర్బన్, రూరల్ ప్రాంతాల్లో నాగుల చవితి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకువ జామునే కుటుంబ సమేతంగా సమీపంలో పంట పొలాలకు వెళ్లి పుట్టల్లో పాలు పోసి నాగ దేవతను కొలిచారు. సామర్లకోటలోని పెద్దాపురం ఏడీబీ రోడ్డు, విస్తరణ శిక్షణ కేంద్రం, టీటీడీసీ, ఉండూరు ఫిల్టర్ ప్లాంటు, నాగార్జున ఫిల్టరు చెరువు, సాంబమూర్తి రిజర్వాయర్, వ్యవసాయ పరిశోధన కేంద్రం, టిడ్కో ఇళ్ల సముదాయం, ఉండూరు రోడ్డు, పంచారామ క్షేత్రం రోడ్లు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ప్రదేశాల్లో ఉన్న పుట్టలను శుభ్రం చేసి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పుట్టలో ఆవు పాలు, కోడిగుడ్లు, చిమ్మి, చలివిడి, బుర్రగుంజు, నూకలు వేసి పూజలు చేశారు. అనంతరం బాణసంచా కాల్చారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు



ఉప్పాడ గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



వాకతిప్ప హైస్కూల్‌లో చిత్రలేఖనం చేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, కొత్తపల్లి గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలను శుక్రవారం నిర్వహించారు. వాకతిప్ప జెడ్పీ పాఠశాలలో గ్రంథాలయ అధికారి తుమ్మలపల్లి జయకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను హెచ్‌ఎం కేజే ఆనంద్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఉప్పాడ గ్రంథాలయంలో లైబ్రేరియన్ నళినీప్రియ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. గ్రంథాలయ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

కాకినాడకు చేరిన శ్రీరాముని పూజాక్షతలు

బోట్‌క్లబ్: శ్రీరామజన్మభూమి క్షేత్రం తీర్థక్షేత్ర అయోధ్య రాముని పూజాక్షతలు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ చేరాయి. స్థానిక భానుగుడి సెంటర్‌లోని భాను లింగేశ్వరస్వామి ఆలయ వద్దకు విజయవాడ ప్రాంతం నుంచి వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్య బిక్కిన రాజు శిరస్సున ధరించి పవిత్రంగా చేర్చారు. ఈ పవిత్ర అక్షతలు పరిషత్ ఆధ్వర్యంలో భానుగుడి నుంచి మెయిన్‌రోడ్డులోని సీతారామ ఆలయం వరకూ శోభాయాత్రగా తీసుకెళ్లారు. స్వామి వారి సన్నిధిలో అక్షతలను ఆరాధించి ప్రతి ఇంటికీ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు గోవింద్, ఆర్.రవిశంకర్ పట్నాయక్, రాజరాజేశ్వర రుద్రశర్మ, భానోజీ రావు పాల్గొన్నారు.

చేతల ప్రభుత్వం ఇది

కొత్తపల్లి: గత ప్రభుత్వం మాదిరిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాటలు చెప్పదని, చేతల ప్రభుత్వమన్నారు. ఈ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలకు దిగుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్‌లో భాగంగా మండలంలోని కొండెవరం సచివాలయం–2లో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నాయకులు పల్లెనిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కొత్త ఇసుకపల్లి సర్పంచ్ తమలిశెట్టి సుబ్బారెడ్డి, వాసంశెట్టి సూర్యప్రకాష్, వేమగిరి నాని, వల్లూరి బాబూరావు, వేమగిరి దానియేలు, వేమగిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



కొండెవరంలో పల్లెనిద్ర చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంచి పుస్తకం విజ్ఞాన సర్వస్వం



పెద్దాపురంలో మాట్లాడుతున్న కవి విశ్వనాథం



సామర్లకోటలో తాము గీసిన చిత్రాలు చూపుతున్న విద్యార్థులు

పెద్దాపురం: పుస్తక పఠనంతో ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల సదస్సులో కవి సమ్మేళనం జరిగింది. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో అభ్యుదయ కవి చల్లా విశ్వనాథం, జ్యోస్యుల కృష్ణబాబు, భళ్లమూడి సూర్యనారాయణ, కొత్త శివ మాట్లాడారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి కనబర్చాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాహిత్యం, దాని అవసరం గుర్తించాలన్నారు. తెలుగు భాష గొప్పదనం వివరించి, కంద పద్యాలు ఆలపించారు. కార్యక్రమంలో లక్ష్మీ లలిత, సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

సామర్లకోట: స్థానిక గ్రంథాలయంలో చిత్రలేఖ పోటీలకు విశేష స్పందన వచ్చింది. విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు గ్రంథాలయాధికారి బందిల రత్నమణి వివిధ రకాల పోటీలను ఏర్పాటు చేస్తున్నారు. సీనియర్ విభాగంలో పర్యావరణ పరిరక్షణ, జూనియర్ విభాగంలో స్వాతంత్ర్య సమరయోధులపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను లైబ్రేరియన్, ఉపాధ్యాయులు జాన్ కెనడీ, టీవీ సత్యనారాయణ, టి.మణికంఠ, సీహెచ్ ఆగ్నేయ, టి.బాలమురళీ పర్యవేక్షించారు. రోజూ గ్రంథాలయ పోటీలకు విద్యార్థులు హాజరుకావాలని రత్నమణి పిలుపు నిచ్చారు. పీబీ దేవం గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సి.మణికుమారి ఆధ్వర్యంలో జూనియర్ విభాగంలో గ్రామీణ వాతావరణం, సీనియర్ విభాగంలో జవహర్‌లాల్ నెహ్రూ అంశంపై పోటీలు జరిగాయి. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు. వేట్లపాలెంలో గ్రంథాలయాధికారి వెన్న సుమతీదేవి ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

కొండయ్యపాలెం ఫ్లైఓవర్ సిద్ధం

కాకినాడ: కొండయ్యపాలెం ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ఈ ఫ్లైఓవర్‌కు మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ వారధిగా నామకరణం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ పనులకు అనుసంధానంగా చేస్తున్న జంక్షన్ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి 2009లో కొండయ్యపాలెం ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన జరగ్గా ఆ తరువాత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగలేదన్నారు. ప్రజల ఇబ్బందులను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి నిధులను విడుదల చేయించి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా తులసి పూజ



సనాతన ధర్మ ప్రచారం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: స్థానిక ధర్మశాస్తా ఆలయంలో శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం సనాతన ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తులసి పూజ నిర్వహించారు. సనాతన ధర్మం కోసం ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఈఓతో పాటు భక్తులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగు



స్టేషన్ సెంటర్‌లో రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో మురుగు నీరు రోడ్డెక్కింది.. ప్రధాన డ్రైన్ పొంగి రోడ్డుపైకి మురుగు వస్తున్నా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. దీంతో ఆయా షాపుల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అక్కడ భరించలేని దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక బస్ కాంప్లెక్స్ నుంచి బసివిరెడ్డి సత్రం వరకూ ఉన్న షాపుల యజమానులు డ్రైన్లను ఆక్రమించి పూడిక తీయడానికి అవకాశం లేని విధంగా స్లాబ్‌లు వేశారు. దీంతో పారిశుధ్య సిబ్బంది పూడిక తీసే పనులు నిలిపివేశారు. హోటళ్ల నిర్వాహకులు చెత్తాచెదారం డ్రైన్‌లో వేయడంతో తెల్లటి పురుగులు పెరిగి భరించలేని చెడు వాసన వస్తుంది. వర్షాలు పడని సమయంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే వానలు వస్తే పరిస్థితి ఏంటని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావును వివరణ కోరగా పూడిక తీయడానికి శుక్రవారం ప్రయత్నాలు చేస్తుండగా వార్డు కౌన్సిలర్ పితాని కృష్ణ అడ్డుకున్నారన్నారు. జేసీబీతో బస్ కాంప్లెక్స్ ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లను ఓపెన్ చేయడంతో పాటు డ్రైన్‌పై ఉన్న ఆక్రమణలు తొలగించాలని కృష్ణ డిమాండ్ చేశారన్నారు. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పూడిక తీత సమస్యను పరిష్కరిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెప్పారు. దీనిపై ఇన్‌చార్జి కమిషనర్ అచ్చుతరాజును వివరణ కోరగా కమిషనర్ సెలవులో ఉన్నారని, ఆయన వచ్చిన తరువాత సమస్యను ఆయన దృష్టికి తీసుకు వెళ్తామన్నారు.